క్లుప్తంగా

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం

రెంటాల(రెంటచింతల): మండలంలోని రెంటాలలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గోవిందమ్మ ,ఈశ్వమ్మతో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం కనులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వెల్లటూరు హనుమాన్ మృత్యుంజయశర్మ స్వామివార్లకు వేకువజాము నుంచే వివిధ రకాల అభిషేకాలతో పాటు ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా స్వామివార్ల భక్తిగీతాల పాట కచేరిని ఏర్పాటు చేశారు.

సత్రశాల దేవస్థానం హుండీ ఆదాయం రూ. 21,850

రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్ద నున్న అతి పురాతన శైవక్షేత్రమైన శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఈ ఏడాది మార్చి 1 నుంచి మే 9వ తేదీ వరకు హుండీ ద్వారా రూ.21,850 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ గాదె రామిరెడ్డి శుక్రవారం తెలిపారు. దేవస్థానం ఆవరణలో లెక్కింపు చేపట్టినట్లు వెల్లడించారు. శివాలయంలో 2024 డిసెంబర్, 23 నుంచి 2025 మే 9 వ తేదీ వరకు హుండీ ద్వారా రూ.8,691 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో శివాలయం ధర్మకర్తల మండలి అధ్యక్షులు పల్లెర్ల లక్ష్మారెడ్డి, దేవస్థానం అర్చకులు వెల్లటూరి నాగేశ్వరశర్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచర్ల: పట్టణంలోని విద్యుత్ 33/11కేవీ సబ్ స్టేషన్‌లు, 11కేవీ లైన్ మరమ్మతుల నిమిత్తం శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు అంతరాయం ఉంటుందని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

యోగ ఉచిత శిక్షణ

పిడుగురాళ్ల: పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత యోగ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు శిక్షణ నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత యోగా శిక్షణ శ్రీ వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఈ నెల 12వ తేదీప్రారంభమవుతుందని చెప్పారు. ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరూ హాజరు కావచ్చునని పేర్కొన్నారు.

మార్కెట్ యార్డులో పొదలు తొలగింపు




పిడుగురాళ్ల: పట్టణంలోని మార్కెట్ యార్డులో శుక్రవారం ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డులో ఉన్న పిచ్చి చెట్లను పొక్లెయిన్ సహాయంతో తొలగించారు. అలాగే ఈ ప్రాంతంలో రాళ్లలతోపాటు ముళ్ల కంపలను తొలగించి మార్కెట్ యార్డును శుభ్రం చేశారు. మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ పనులు పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నూజెండ్ల: మండలంలోని కొత్త ఉప్పలపాడు వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని టాటా ఏస్ వాహనం ఢీ కొన్న సంఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొత్త కొత్తపాలెం గ్రామానికి చెందిన కుంటా వెంకటరెడ్డి (62) ద్విచక్ర వాహనంపై వినుకొండ వెళ్తుండగా ఎదురుగా వస్తున్న టాటా ఏస్ వాహనం ఢీ కొంది. దీంతో వెంకటరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఐనవోలు ఎస్సై బీవీ కృష్ణారావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

నరసరావుపేటలో పోలీస్ తనిఖీలు



నరసరావుపేటటౌన్: భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో పల్నాడు జిల్లా పోలీసులు అప్రమత్తం అయ్యారు. బుధవారం అర్ధరాత్రి నుంచే జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని రద్దీ ప్రాంతాలపై దృష్టి సారించారు. శుక్రవారం వన్‌టౌన్ సీఐ విజయ్‌చరణ్ ఆధ్వర్యంలో డీమార్ట్‌ను పోలీస్ జాగిలాలతో వెళ్లి పరిశీలించారు. టూటౌన్ పరిధిలోని కాసు సెంట్రల్ మాల్‌ను సీఐ హైమారావు పరిశీలించారు. అదే విధంగా రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో పరిశీలించి అక్కడ అనుమానితులను విచారించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో ప్రజలు, వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలి

జిల్లా బాలికల సంరక్షణ అధికారి శౌరిబాబు



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పిడుగురాళ్ల: బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా బాలికల సంరక్షణ అధికారి డి.శౌరిబాబు అన్నారు. పట్టణంలోని అన్ని వార్డులలో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాల్య వివాహాలు జరిగితే లేదా జరుగుతున్నప్పుడు ఆ సమాచారాన్ని చైల్డ్ మ్యారేజ్ కమిటీకి, చైల్డ్ కేర్ నంబర్ 1098, ఎమర్జెన్సీ నంబర్ 100కి సమాచారం అందించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు కె.కరిముల్లా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు టి.ప్రసన్నకుమారి, కోటేశ్వరి, కిశోరి వికాసం ఏఎన్‌ఎం పి.శివపార్వతి, అంగన్‌వాడీ టీచర్లు, ఎస్కే హసీనా, ఎస్కే పీరామహబూబి, పి.రత్నకుమారి, మహిళా పోలీస్‌లు సీహెచ్ ఉదయ దీపిక పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చేయవద్దు

దాచేపల్లి: బాల వివాహాలు చేయవద్దని డీఎల్‌పీఓ జయరాజ్ అన్నారు. నడికుడి ప్రభుత్వ పాఠశాలలో కిశోరి వికాసం 2.0 కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండేంత వరకు బాలికలను చదివించాలని, చిన్న వయస్సులో వివాహాలు చేసి ఆడపిల్లల జీవితాలను అగాంధంలోకి నెట్టవద్దని జయరాజ్ చెప్పారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని బాలికలను చదివించాలని, పురుషులతో సమానంగా సమాజంలో రాణించేలా తల్లిదండ్రులను ఆడపిల్లలను ప్రోత్సాహించాలని కోరారు. బాలవివాహాలు చేయటం చట్టరీత్యా నేరమని, ఆడపిల్లలను మంచి విద్యనందించి జీవితంలో అన్ని రంగాల్లో రాణించేలా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వరలక్ష్మి, ఎంఎస్‌కే నాగేంద్రం, ఏఎన్‌ఎం సీతమ్మ, వీఓఏలు నాగమణి, సంగీత, అంగన్‌వాడీ కార్యకర్తలు శివకుమారి, ధనలక్ష్మి, శ్రీలక్ష్మి, మాణిక్యం పాల్గొన్నారు.



రాయవరంలో మాట్లాడుతున్న సీడీపీఓ లీలావతి

బాల్య వివాహాలు అరికట్టేందుకు సమష్టి కృషి

మాచర్ల రూరల్: బాలికలకు నిర్ణీత వయస్సు దాటిన తరువాతే వివాహాలు జరిపించేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించి బాల్య వివాహాలను అరికట్టడంలో అంగన్‌వాడీ ఉద్యోగులు కృషి చేయాలని సీడీపీఓ లీలావతి కోరారు. శుక్రవారం మండలంలోని రాయవరంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఉద్యోగులు గ్రామ ప్రజలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. యుక్త వయస్సు రాకుండానే బాలికలకు వివాహం జరిపితే వారికి అనారోగ్యంతో పాటు, బిడ్డల ఎదుగుదలలో ఎన్నో ఇబ్బందులు వస్తాయని, అమ్మాయిలకు 18, అబ్బాయిలకు 21సంవత్సరాలు దాటిన తరువాతనే వివాహాలు జరిపించాలని కోరారు. చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించేందుకు మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేరి్ంచాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ ఉద్యోగులు పి.ఇందిర, సిహెచ్.సునిత, పున్నమ్మ, జయమ్మ, సైదమ్మ, ఎలిజ్వా, డీయూపీయూ కౌన్సిలర్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో 20 మంది ఎంపిక



క్యాంపస్ ప్లేస్‌మెంట్ నిర్వహిస్తున్న దృశ్యం

మాచర్ల: నిరుద్యోగులు, ఉపాధి రంగంలో వివిధ అవకాశాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌లో ముందుకెళ్లాలని హైదరాబాద్‌కు చెందిన దివిస్ లేబరేటరీస్ హెచ్‌ఆర్ శివకృష్ణ, చక్రధర్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ కుర్రి సాయి మార్కొండారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక చక్రధర్ డిగ్రీ కళాశాలలో హైదరాబాద్ దివిస్ సంస్థ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల గురించి వివిధ రంగాలలో ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 54 మంది విద్యార్థిని, విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా అందులో 20 మంది ప్లేస్‌మెంట్‌కి ఎంపికయ్యారు. వీరందరూ శివరామకృష్ణ, కుర్రి సాయి మార్కొండారెడ్డి, దివీస్ సంస్థ హరికృష్ణ, కళాశాల డైరెక్టర్ ఉమామహేశ్వరరెడ్డి నియామక పత్రాలు అందించి అభినందించారు.

మరుగుదొడ్లకు దరఖాస్తు చేసుకోండి



మున్సిపల్ కమిషనర్ వేణుబాబు

మాచర్ల: పట్టణ పరిధిలో సొంత గృహం కలిగి ఉండి వ్యక్తిగత మరుగుదొడ్డి లేని వారు మరుగుదొడ్డి నిర్మించుకోవటానికి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని మరుగుదొడ్లు లేని ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకుంటే రూ.15 వేలు సబ్సిడీ ఇవ్వటం జరుగుతుందని చెప్పారు. ఇందుకు సంబంధించి ఆయా సచివాలయాలలో మౌలిక సదుపాయాల కార్యదర్శి వారిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు పాస్‌పుస్తకం నకలుతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిరాక్స్ కాపీలు మొత్తాన్ని ఈ నెల 12వ తేదీలోగా సంబంధించిన సచివాలయంలో అందించాలని పేర్కొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నరసరావుపేట ఈస్ట్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20వ తేదీన దేశ వ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక, రైతు సంఘాల నేతలు పిలుపు నిచ్చారు. అరండల్ పేటలోని ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం వివిధ కార్మిక, రైతు సంఘాలతో సార్వత్రిక సమ్మె సన్నాహక రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమ్మెను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన ఐక్య కార్యాచరణను రూపొందించారు. వివిధ కార్మిక సంఘాలు వారి వారి పరిధిలో సమావేశాలు నిర్వహించటంతో పాటు ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా మైక్, కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే 17వతేదీన మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి ప్రజలను చైతన్యపరచనున్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు, సిఐటీయూ జిల్లా కోశాధికారి శివకుమారి, ఆయా కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఉచిత మెగా కంటి వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేయించుకుంటున్న జడ్జి మహతి

వినుకొండ: వినుకొండ న్యాయవాద సంఘం వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం (మాక్స్ విజన్ డాక్టర్ రామలింగారెడ్డి కంటి ఆసుపత్రి నరసరావుపేట వారి సౌజన్యంతో) కోనెక్ డయాగ్నోసిస్ వారి ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిస్ ఆరోగ్య పరీక్షా కేంద్రంను వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి ఎం.మహతి ప్రారంభించారు. ఈ కంటి వైద్యం శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు చేసి రాయితీపై కళ్లజోళ్లు, మెడిసిన్స్ ఇవ్వడం జరుగుతుందని, ఉచిత డయాబెటిక్ ఆరోగ్య పరీక్షా కేంద్రంలో రక్త పరీక్షలు ఉచితంగా చేయడం జగుతుందని తెలియజేశారు. న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు, కోర్టు సిబ్బంది, పోలీసులు, కక్షిదారులు అందరికీ కంటి పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించడం జరుగుతుంది అని న్యాయవాద సంఘ సభ్యులు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రెటరీ పఠాన్ గౌస్, మొహిద్దిన్ ఖాన్, జాయింట్ సెక్రెటరీ నీలం శేఖర్ బాబు, ట్రెజరర్ వరగాని శివశంకర బాబు, జి. వెంకటేశ్వర్లు, కె.చెన్న కేశవరెడ్డి, కె.ఎస్.ఎన్.వి. నాయుడు, ఎన్.రమణా రావు, వి.అమర్ బాబు, డి.నాగరాజు, ఎం .మల్లికార్జున్ రెడ్డి, ఎస్ రామాంజనేయరెడ్డి సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేయాలి



మాట్లాడుతున్న మారుతీ వరప్రసాదరావు

బొల్లాపల్లి: వరికపూడిశెల ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేసి బొల్లాపల్లి మండలంతో సహా నాలుగు మండలాల ప్రజలకు తాగునీరు, సాగునీరు వెంటనే కల్పించాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన బొల్లాపల్లిలో మండల కార్యదర్శి పిన్నిబోయిన వెంకటేశ్వర్లు అధ్యక్షతన సీపీఐ 5వ మండల మహాసభ నిర్వహించారు. ముందుగా ఎర్రజెండాను ఇరగబోయిన కోటేశ్వరరావు ఆవిష్కరించారు. మహాసభలో మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వరికపూడిశెలను పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బండ్లమోటు సీసపు గనిని పునఃప్రారంభించి యువతకు ఉపాధి కల్పించాలన్నారు. తల్లికి వందనం, ఇళ్ల స్థలాలు, ఇల్లు లేని వారికి ప్రభుత్వమే ఇల్లు కట్టించి ఇవ్వాలని, పింఛన్లను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బండ్లమోటులో సీసపు గనిని పునఃప్రారంభించాలని, వరికపూడిశెల పనులు ప్రారంభించాలని, తాగునీటి ఎద్దడిని తీర్చాలని, తాగు, సాగునీటి కోసం శాశ్వత పథకాలను వెంటనే ప్రారంభించాలని తీర్మానాలను చేశారు. అనంతరం 9మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో నియోజకవర్గ కార్యద ర్శి బూదాల శ్రీనివాసరావు, సైదావలి, షేక్ కొండ్రముట్ల చిన్న సుభాని, కొప్పరపు మల్లికార్జునరావు, కండే నాసరయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దాచేపల్లి: సబ్ స్టేషన్లు, 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ భగవాన్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం ఉంటుందని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

12న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

మాచర్ల రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక నియోజకవర్గ స్థాయిలో ఈనెల 12వ తేదీ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బి.కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెహ్రూనగర్‌లోని వీవీఎస్ గార్డెన్‌లో నిర్వహించనున్న వేదికకు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఇతర అధికారులు పాల్గొంటారని చెప్పారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలు సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని చెప్పారు.

మైనర్ కాలువకు మరమ్మతులు చేయించాలి

వినుకొండ: బ్రాహ్మణపల్లి, విఠంరాజుపల్లి చివరి వరకు ఉన్న ఎస్ఎస్‌పీ మైనర్ ఇరిగేషన్ కాలువకు వెంటనే మరమ్మతులు చేయించాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, కలెక్టర్ పి.అరుణబాబును రైతులు కోరారు. వినుకొండలో జరిగిన అధి కారుల సమీక్ష కార్యక్రమంలో పాల్గొన్న అధికారులను, ప్రజాప్రతినిధులు రైతులు పగడాల చిన్నకోటిరెడ్డి, యాదాల శంకరరావు, కంట రంగారావు, గాయం చంద్రారెడ్డిలుకలిసి వినతిపత్రం అందజేశారు.

ఏఎంరెడ్డి అధ్యాపకుడికి డాక్టరేట్

నరసరావుపేట రూరల్: ఏఎంరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ అధ్యాపకుడు ఎం.అనంద్‌కుమార్ డాక్టరేట్ డిగ్రీ సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్. మల్లికార్జున్ శుక్రవారం తెలిపారు. చెన్నైకి చెందిన సత్యభామ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ప్రైవసి ఆన్ బిగ్ డేటా అనే అంశంపై పీహెచ్‌డీ డిగ్రీని సాధించినట్టు వివరించారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి అనంద్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మల్లికార్జున్, డిప్లొమా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాలికలు విద్యలో రాణించాలి

శావల్యాపురం: బాలికలు విద్యలో రాణిస్తే సామాజికాభివృద్ధి సాధ్యమవుతుందని పీడీ ఉమాదేవి అన్నారు. మండలంలోని శావల్యాపురం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలలో కిషోర వికాసం కార్యక్రమంపై జరుగుతున్న వేసవి శిక్షణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి మాట్లాడుతూ బాలికా వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. పరిస్థితులు ఎలాంటి వైనా బాల్య వివాహాలతో అనర్థాలు తప్పవన్నారు. ఆడపిల్లలను తల్లిదండ్రులు భారంగా భావించరాదన్నారు. మీ చుట్టు ప్రక్కల అలాంటి వివాహాలు జరుగుతున్నట్టు తెలిస్తే వెంటనే సచివాలయ మహిళా పోలీసుకుగానీ, ఐసీడీయస్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో అనూరాధ, సూపర్‌వైజర్ శ్రీలత, ఎఎన్ఎం నాగలక్ష్మి ఉన్నారు.

ఐటీఐ సీట్లు భర్తీకి చర్యలు తీసుకోవాలి

నాదెండ్ల: రెండేళ్లక్రితం నీతి అయోగ్ నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా పదిహేను వేల ఐటీఐ సంస్థల్లో సగానికి పైగా సీట్లు భర్తీకావటం లేదని, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు తెలిపారు. కళాశాలల్లో 50 శాతం పైగా బోధనా సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉండటం ఒక కారణమన్నారు. పాత భవనాలు, రేకుల షెడ్లతో తరగతి గదులు కొనసాగించటం, ఆధునిక సాంకేతిక మార్పులకు అనుగుణంగా యంత్ర పరికరాలు లేకపోవటం మరోకారణమన్నారు.

సమ్మె విజయవంతంపై సదస్సు

నరసరావుపేట: ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో అన్నీ రంగాల కార్మికులు, స్కీం వర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులునాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణం కోటప్పకొండరోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో సమ్మె జయప్రదం కోరుతూ వివిధ సంఘాలతో ఏర్పాటు చేసిన సదస్సుకు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పల్నాడు జిల్లా అధ్యక్షురాలు దేవి అధ్యక్షత వహించారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



తైవాన్ స్ప్రేయర్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

రెంటచింతల: రైతులకు అండగా ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గ్రామంలోని కుందురు చిన్నపురెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఏపీ కమ్యూనిటీ మేనేజ్ ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహించడంలో భాగంగా ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ కిట్స్‌ను అందించారు. ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నేతృత్వంలో అన్నదాతలకు అండగా యాంత్రీకరణలో భాగంగా రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలను అందించడంతో పాటు తైవాన్ స్ప్రేయర్లను రూ.10 వేల రాయితీపై ఇస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో కొత్త పంటలను ప్రోత్సహించడంలో భాగంగా ప్రయోగాత్మకంగా నువ్వుల పంటను సాగు చేసేలా రైతులలో చైతన్యం తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మాచర్ల వ్యవసాయ సహాయ సంచాలకులు జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ డి.మేరీ కనకం, ఏఓ బి.బ్రహ్మారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ జి.సుమంత్‌రెడ్డి, మాజీ పీహెచ్‌సీ చైర్మన్ బి.రామకృష్ణ, పార్టీ నాయకులు టి.జోజిరెడ్డి, జి.వెంకటరామిరెడ్డి, ఎ.బ్రహ్మారెడ్డి, ఎల్.మాధవరావు, ఎస్.నర్సింహారావు, పి.సైదారావు, చేర్రెడ్డి కోటిరెడ్డి, మూలి రాజారెడ్డి పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో మార్పులకు పార్టీలు సహకరించాలి

ఆర్డీఓ మురళీకృష్ణ



మాట్లాడుతున్న ఆర్డీఓ

గురజాల రూరల్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు రాజకీయ పార్టీలు సహకరించాలని ఆర్డీఓ మురళీకృష్ణ కోరారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీఓ ఓటర్ల స్వచ్ఛీకరణ, పోలింగ్ కేంద్రాలలో కనీస వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 800 ఓటర్ల నుంచి 1200 ఓటర్లు కలిగిన పోలింగ్ కేంద్రాలు ఓటర్ల నివాస ప్రాంతానికి రెండు కిలోమీటర్లు దూరంలో ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరుగుతుందని చెప్పారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ కె.అన్నారావు మాట్లాడుతూ ఎన్నికల కేంద్రాలను గత ఎన్నికల్లో మార్పు చేశారని, వాటిని యథావిధిగా ఉంచాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ కె.నగేష్, టీడీపీ పట్టణ కన్వీనర్ అడపా శ్రీనివాసరావు, ఎన్.బొల్లయ్య పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను కాలరాస్తున్న ప్రభుత్వం



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టు సంఘం నాయకులు

గురజాల: పత్రికా స్వేచ్ఛను ప్రభుత్వం కాలరాస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ హుస్సేన్, డెమొక్రటిక్ జర్నలిస్టు ఫెడరేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఎ కృష్ణకుమార్ అన్నారు. సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్ ధనంజయరెడ్డి ఇంటిలోకి గురువారం ఉదయం అనుమతులు లేకుండా పోలీసులు ప్రవేశించడాన్ని నిరసిస్తూ గురజాల, మాచర్ల నియోజకవర్గాల పరిధిలోని విలేకరులు శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా పత్రికా ఎడిటర్ ఇంటిలో సోదాలు చేయడం దారుణమన్నారు. పత్రికా స్వేచ్ఛ లేకుండా చేయాలనే దురుద్దేశంతోనే ఈ విధంగా చర్యలు చేపడుతున్నారన్నారు. సమాజంలో నాల్గవ స్తంభంగా ఉన్న మీడియాను ఇబ్బందులకు గురిచేయాలనే ఆలోచనతో ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని ఖండించాలన్నారు. ముందుగా పాతపాటేశ్వరి అమ్మవారి దేవాలయం వద్ద నుంచి రెవెన్యూ డివిజన్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రెవెన్యూ డివిజనల్ అధికారి మురళీకృష్ణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాచర్ల సాక్షి ఆర్సీ ఇన్‌చార్జి ఎంఎస్ నాగేశ్వరరావు, గురజాల ఆర్సీ ఇన్‌చార్జి ఆచంట కృష్ణకుమార్, డివిజన్ పరిధిలోని విలేకరులు పాల్గొన్నారు.

పొట్టేలును చంపితిన్న వీధి కుక్కలు!

నాదెండ్ల: గ్రామాల్లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కుక్కల నివారణకు స్థానిక అధికారులతో పాటూ జిల్లా అధికారులు సైతం స్పందించకపోవటంతో ఎంతోమంది కుక్కకాటుకు గురికావటంతో పాటూ ఆర్థికంగా నష్టపోతున్నారు. మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలో గురువారం రాత్రి గ్రామానికి చెందిన రైతు వడ్లమూడి శ్రీకాంత్ తన గేదెల పాకలో పొట్టేలును ఉంచాడు. అర్ధరాత్రి సమయంలో వీధికుక్కలు పాకలోకి జొరబడి పొట్టేలుపై దాడిచేసి చంపేశాయి. పొట్టేలు కళేబరాన్ని ఈడ్చుకెళ్ళి తిన్నాయి. ఉదయం గమనించిన బాధితుడు లబోదిబోమన్నాడు. దీని విలువ రూ.10 వేల వరకూ ఉంటుందని చెప్పాడు. రెండు రోజుల క్రితం గణపవరం శాంతినగర్‌లోని వీధుల్లో కుక్కలు దాడిచేయటంతో పలువురు గాయాలపాలయ్యారు. ఏడాది క్రితం నుంచి పాకల్లో ఉన్న సుమారు పది లేగదూడలు, ఇరవై వరకూ మేక పిల్లలపై దాడి చేసి చంపేశాయి. వీధికుక్కల బెడద నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

భారత జాతి గర్వించదగ్గ వ్యక్తి మహారాణాప్రతాప్‌సింగ్

నరసరావుపేట: స్థానిక మాహత్మాగాంధీ క్లాత్‌మార్కెట్‌లోని శ్రీనివాస్ ఇంజినీర్స్ కార్యాలయంలో శుక్రవారం శ్రీ మాహారాణా ప్రతాప్‌సింగ్ 486వ జయంతి ఘనంగా నిర్వహించారు. ప్రతాప్‌సింగ్ చిత్రపటానికి పూలు చల్లి నివాళులు అర్పించారు. బొందిలి శ్రీనివాససింగ్ మాట్లాడుతూ భారత జాతి గర్వించతగ్గ మహావ్యక్తి రాణా ప్రతాప్‌సింగ్ అన్నారు. ఇప్పటి బావి భారత పౌరులు వారిని ఆదర్శంగా తీసుకుని వారి ధైర్యసాహసాలు గుర్తుంచుకోవాలని కోరారు. అలాగే ఇప్పుడు జరుగుతున్న సింధూర్ యుద్ధం విజయవంతం కావాలని, సైనికులు వారిని ఆదర్శంగా తీసుకొని మనోధైర్యం కోల్పోకుండా యుద్ధం చెయ్యాలని సూచించారు. బత్తుల మురళి, గట్టుపలి సత్యనారాయణ, రెబ్బాల శ్రీనివాస్, నాగమల్ సింగ్, బొందిలి సితారాంసింగ్ పాల్గొన్నారు.

వర్షపు ధాటికి కత్తవ వాగు అతలాకుతలం



గురువారం సాయంత్రం ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో జోరుగా కురుస్తున్న వర్షం

నరసరావుపేట: పట్టణంలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఈ వర్షంతో ఆవుల సత్రం పక్కనే ఉన్న కత్తవ చెరువుకు దారి తీసే వాగు పొంగి చుట్టుపక్కల ప్రవహించి రహదారిపైకి వచ్చేక్రమంలో అధికారులు సకాలంలో పూడిక తీయడంతో ప్రమాదమే తప్పింది. అదే భారీ వర్షం పడి అధికారులు గమనించకపోతే ఆ ప్రాంత ఇళ్లల్లోకి నీళ్లు రావడం, ప్రజలు జనజీవనం అతలాకుతలమవడం జరిగిఉండేది. భారీ వర్షం కురిస్తే పట్టణంలోని పలు ప్రాంతాలు నీటితో నిండిపోయి ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి నరసరావుపేటతో ఉంది. 2016 సెప్టెంబరు 21వ తేదీ అర్ధరాత్రి ఒకేసారి 22 సెంటిమీటర్ల వర్షం కురిసింది. దీంతో నకరికల్లు పల్లపు ప్రాంతాల నుంచి పట్టణం మీదకు నీరు భారీగా ప్రవహించటంతో పల్నాడురోడ్డు, పెద్ద చెరువు, బరంపేట, గుంటూరు రోడ్డులలో ఐదారు అడుగుల ఎత్తున చేరింది. ఆ అనుభవాన్ని చూసిన పట్టణ ప్రజలు నిత్యం డ్రెయిన్‌లు ఆక్రమణకు గురికాకుండా చూడాలంటూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. గురువారం రాత్రి కురిసిన చిన్న వర్షానికే పలు ప్రాంతాల్లో నీళ్లు రోడ్లపై ప్రవహించాయి. కాలువల్లో నిర్మించిన అక్రమ కట్టడాలు, చేరిన ప్లాస్టిక్ వ్యర్థాలతో కూడిన పూడిక సకాలంలో తొలగించకపోతే అవి గోనెలకు అడ్డుపడి నివాస ప్రాంతాలను ముంచెత్తే ప్రమాదం పొంచిఉంది. కాగా, సత్తెనపల్లిరోడ్డులో జరిగిన పరిస్థితిపై దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు శుక్రవారం పరిశీలించి తాము కత్తవ వాగులో కొందరు చేస్తున్న ఆక్రమణలను తొలగించాలని అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చామని, కలెక్టర్ సంబందిత మైనర్ ఇరిగేషన్‌శాఖ, మున్సిపల్, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. కాబట్టి తక్షణమే ప్రభుత్వ యంత్రాంగం అందరూ బాధ్యతగా కత్తవ చెరువు వాగు ఆక్రమణలను తొలగించాలని కోరారు.